క్లుప్తంగా

మన్నవలో ఉర్దూ ప్రాథమిక పాఠశాల తనిఖీ



పొన్నూరు: మండలంలోని మన్నవ గ్రామంలోని మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎం.డి. ఖాసిం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల ఎఫ్.ఏ2 పరీక్ష పత్రాలు, విద్యార్థుల ప్రగతి పత్రాలను పరిశీలించారు. ప్రతి ఒక్క విద్యార్థికి ప్రత్యేకంగా ప్రగతి రికార్డును ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు విద్యార్థి అభివృద్ధిని నమోదు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు నసీమా బేగం, రిజ్వానా సుల్తానా పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నేత మైలా మృతి



సుద్దపల్లి(చేబ్రోలు): సుద్దపల్లి మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు మైలా హనుమంతరావు అనారోగ్యంతో బుధవారం మరణించారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న హనుమంతరావు(42) సాయంత్రం ఇంటి వద్ద మృతి చెందారు. గురువారం సుద్దపల్లి గ్రామంలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. హనుమంతరావు మృతికి పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య సంతాపం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు, బీసీ సంఘాల నాయకులు నివాళులు అర్పించారు.

నేడు ఉపాధిహామీ బహిరంగ ప్రజావేదిక

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం బహిరంగ ప్రజావేదికను నిర్వహించడం జరుగుతుందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఇన్‌చార్జి ఏపీవో మస్తాన్‌వలి తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో రూ.4.40 కోట్ల రూపాయలతో ఉపాధిహామీ స్కీం ద్వారా పనులను చేశారు. ఆయా పనులకు సంబంధించి గత కొద్దిరోజులుగా సోషల్ ఆడిట్ బృందాలు పంచాయతీల్లో తనిఖీలు చేశాయి. అనంతరం పదహారు గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు జరిపారు. ఈ నేపథ్యంలో నేడు ప్రత్తిపాడులో బహిరంగ ప్రజావేదికను జరపనున్నట్లు ఆయన చెప్పారు. ప్రజావేదికకు డ్వామా జిల్లా పీడీ యుగంధర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరవ్వనున్నట్లు చెప్పారు.

నేడు పాఠశాలల్లో చేతుల పరిశుభ్రత

ప్రత్తిపాడు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నేడు చేతుల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్వచ్ఛభారత్ మిషన్ మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు తెలిపారు. యూనిసెఫ్ సూచనల మేరకు స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో గురువారం అన్ని పాఠశాలల్లో చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించి, చేతుల పరిశుభ్రతకై ప్రతిజ్ఞను చేయించడం జరుగుతుందని శ్రీనివాసరావు చెప్పారు. ఏఏ సమయాల్లో చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలి, చేతులను పరిశుభ్రంగా ఉంచుకునే పద్ధతులు. పరిశుభ్రత పాటించకపోవడం వలన ఎదురయ్యే నష్టాలు.. వంటి అంశాలను విద్యార్థులకు వివరించడం జరుగుతుందని వివరించారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



నంబూరులో జగనన్న ఆరోగ్య సురక్షలో పేషెంట్ల పేర్లు రిజిస్ట్రేషన్ చేస్తున్న సిబ్బంది

పెదకాకాని: జగనన్న ఆరోగ్య సురక్ష గొప్ప కార్యక్రమమని పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి అన్నారు. మండలంలోని నంబూరు జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచ్ నంబూరు జ్యోతి విచ్చేశారు. ఎంపీపీ తుల్లిమిల్లి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు చేసి స్పెషలిస్ట్ డాక్టర్లచే వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యం అన్నారు. నంబూరు శిబిరంలో 507 మందికి వైద్యసేవలు అందించారు.పెదకాకాని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పుసులూరి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. 155 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 131 మందికి కళ్ళజోళ్ళు ఇస్తామన్నారు. ఏడుగురికి శస్త్ర చికిత్సల కోసం రిఫర్ చేశారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ కేఎస్ఎల్ఎస్ చారి, డాక్టర్ ప్రవీణదీప్తి, డాక్టర్ అనూష, డాక్టర్ భవిష్యలు పేషెంట్లకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, ఎంపీడీఓ ఎ.రామకృష్ణ, సూపరింటెండెంట్ బి.వి.మల్లేశ్వరరావు, సర్పంచి నంబూరు జ్యోతి, ఎంపీటీసీ సభ్యుడు షేక్ అబ్దుల్ లతీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్ సుబాని, వక్ఫ్‌బోర్డు సభ్యుడు సయ్యద్ సుబాని, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు చినలింగాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

కాకుమాను: మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించే వైద్య శిబిరంలో ప్రజలకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

వరిలో మేలైన సాగు పద్ధతులపై పొలంబడి



వరిపైరును పరిశీలిస్తున్న జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు

పెదకాకాని: వరి పంటలో తెల్ల దోమ, పచ్చ దోమ నివారణ కొరకు జిగురు పూసిన పసుపు రంగు అట్టలను పైరు మధ్యలో పెట్టుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రామాంజనేయులు అన్నారు. పెదకాకాని మండలం, గోళ్ళమూడి గ్రామ శివార్లలో బుధవారం వరిలో మేలైన సాగు పద్ధతులపై పొలంబడి నిర్వహించారు. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజనేయులు మాట్లాడుతూ వరి పంటలో ఆకుముడత పురుగు నివారణకు రైతులు విచక్షణా రహితంగా రసాయనిక మందులు పిచికారీ చేయవద్దన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఫిరమోన్ ట్రాప్స్ లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పురుగు ఉధృతిని గుర్తించి అవసరాలకు అనుగుణంగా పురుగు మందులు వాడాలన్నారు. ముందుగా వరి పైరును పరిశీలించారు. వీఏఓ రెడ్డి వీర శివాజీ, వీఏఏ వి.విజయలక్ష్మి, వలంటీర్లు, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

కిట్స్‌లో ఫిట్ ఇండియా స్వచ్ఛతా రన్



స్వచ్ఛతా రన్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: స్థానిక వింజనంపాడులోని కేకేఆర్ అండ్ కేఎస్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (కిట్స్ కళాశాల)లో బుధవారం ఫిట్ ఇండియా స్వచ్ఛతా రన్ 4.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్, యూజీసీ ఆదేశాల మేరకు స్థానిక కళాశాలలో విద్యార్థులు అధ్యాపకులతో కలిసి ఐదు కిలోమీటర్లు వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ వాకింగ్ అనేది మన దినచర్యలో భాగంగా ఉండాలన్నారు. నడక మన ఆరోగ్యాన్ని రక్షిస్తుందని, శరీర దృఢత్వాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.చంద్రారెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళ్ళం కళాశాలలో ఉచిత మెడికల్ క్యాంప్



గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కళ్ళం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ సాయిబాబా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డి.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ పీఎల్ మాధవరావు, పీడీ పున్నారెడ్డి తదితరులున్నారు.

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: పురుగుల మందు తాగిన వ్యక్తి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కొరిటెపాడుకు చెందిన రామనాదం శివప్రసాద్(36) ప్రైవేట్ బ్యాంక్‌లలో లోన్లు ఇప్పిస్తూ ఉంటాడు. అదేవిధంగా లోన్లు ఇప్పించిన వారిలో కొందరికి అతనే ష్యూరిటీ ఉంటాడు. ఈ క్రమంలో లోన్లు తీసుకున్న వాళ్ళు కొందరు చెల్లించకపోవటంతో ఇతనే చెల్లించాల్సి రావటంతో మనస్థాపానికి గురయ్యాడు. ఈ నెల 9వ తేదీన జేకేసీ కళాశాల రోడ్డులో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి గురయ్యాడు. గమనించిన స్థానికులు నల్లపాడు పోలీసులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కేవైసీ అప్‌డేట్ పేరిట మోసం

పట్నంబజారు: కేవైసీ అప్‌డేట్ పేరిట బురిడీ కొట్టించి ఖాతా నుంచి అక్రమంగా నగదు డ్రా చేసిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. సంపత్‌నగర్‌కు చెందిన షేక్ ఆలిహుస్సేన్‌కు యాక్సెస్ బ్యాంకులో రెండు అకౌంట్లు ఉన్నాయి. ఈనెల 5న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి తాను బ్యాంకు మేనేజర్‌నని, కేవైసీకి సంబంధించి అప్‌డేట్ చేయాలని నమ్మబలికే ప్రయత్నం చేశాడు. దీంతో అలి హుస్సేన్ తాను బ్యాంకుకు వచ్చి అప్‌డేట్ చేయించుకుంటానని చెప్పిన క్రమంలో ఫోన్ పెట్టేసిన తరువాత కొద్దిసేపటి తరువాత అదే వ్యక్తి ఫోన్ చేసి అకౌంట్ హ్యాక్‌కు గురైందంటూ నమ్మబలికాడు. ఓటీపీ చెప్పకపోతే నగదు పోతుందని భయపెట్టాడు. దీంతో సెల్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పగా, అకౌంట్‌లోని రూ. 3 లక్షలు నగదు విత్‌డ్రా అయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ భూమి మార్పిడికి సచివాలయాల్లో సంప్రదించండి

తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ



చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర భూములుగా మార్చుకునేందుకు స్థానిక గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ బుధవారం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో గోపాలకృష్ణ మాట్లాడుతూ కన్వర్షన్ కోసం భూమి యొక్క మార్కెట్ విలువలో ఐదు శాతం రుసుం ప్రభుత్వ ఖజానాకు చెల్లించి, మార్చుకునేందుకు అవకాశం ఉందన్నారు. 2019 నుంచి ఖజానాకు రుసుం చెల్లించిన వారి అర్జీలు ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో చూపుతున్నట్లు తెలిపారు. 2019 తరువాత వ్యవసాయేతర భూములుగా మార్చుకున్న వారు అధీకృత అధికారి వద్ద నుంచి పొందిన అనుమతి ఉత్తర్వులు, భూమికి సంబంధించిన రిజిస్ట్రేషన్ దస్తావేజుల నకళ్లను తహసీల్దారు కార్యాలయంలో వారం పని దినాలలో సమర్పించాలని తెలిపారు. అనుమతులు పొందకుండా వ్యవసాయేతర భూములుగా మార్చు కున్నట్లు గుర్తించినట్లయితే అదనంగా మరో ఐదు శాతం పెనాల్టీ విధించటం జరుగుతుందన్నారు. ఇటీవల మంచాల గ్రామ మెయిన్ రోడ్డు పక్కన అనధికారికంగా నిర్మాణం చేస్తున్న వారి వద్ద నుంచి ప్రభుత్వ ఖజానాకు చలానా జమ చేయబడిందన్నారు. అపోహలను, దళారులను నమ్మవద్దన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించి, రెవెన్యూ రికార్డులను సరి చేసి రైతులకు మేలు చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ కోరారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

పొన్నూరు: పొన్నూరు పట్టణానికి చెందిన ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ షేక్ అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. సిద్ధి వినాయక నగర్‌కు చెందిన 11 సంవత్సరాల విద్యార్థిని తన పెదనాన్న వద్ద ఉండి పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తుంది. అయితే తన ఇంటి సమీపంలోనే నివాసం ఉంటున్న 50 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. నిందితుడు కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి

ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

కాకుమాను: మండలంలోని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇప్పటి వరకు గత నాలుగున్నర సంవత్సరాల నుంచి మండలంలోని అన్ని గ్రామాలలో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇంకా గ్రామాలలో చేపట్టవలసిన పనులను గుర్తించి వెంటనే ఆయా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్యం, తాగునీరు, ఇతర సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా గ్రామాలలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి సాంబయ్య, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, రేటూరు సొసైటీ అధ్యక్షులు వల్లూరి పండు, ఎంపీడీఓ రామకృష్ణ, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత, ఎంఈఓ కెఎఫ్.కెనడీ, ఏఓ కె.కిరణ్మయి, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను కాపాడాలి



పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న సిస్టర్ లత



బాలికలతో ప్రజాప్రతినిధులు, అధికారులు

పెదకాకాని: బాలికల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చైల్డ్ ప్రొటెక్షన్ ఇన్‌చార్జి సిస్టర్ లత అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో మంగళగిరి గుడ్ షెఫర్డ్ సిస్టర్స్ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి మాట్లాడుతూ బాలికలు ఉన్న హక్కులను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. బాలికల అభివృద్ధి కేవలం విద్యతోనే సాధ్యపడుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని సమాజంలో ఉన్నత వ్యక్తులుగా రాణించాలన్నారు. బాలికలు బాగా చదువుకుని అన్ని రంగాలలో ముందుండాలన్నారు. సీనియర్ అడ్వకేట్ కాళిదాసు, సీడీపీఓ వి.రమణ, సిస్టర్ ఊర్మిళ, సంస్థ కో ఆర్డినేటర్లు, పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యుని ఇంటిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు

పెదకాకాని: వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యుని ఇంటిపై టీడీపీ వర్గీయులు దాడి చేసిన ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో వినాయక చవితి పురస్కరించుకుని నిమజ్జనం సందర్భంగా డీజే పాటలు పెట్టే క్రమంలో వివాదం జరిగిన సంగతి విదితమే. అప్పటి నుంచి స్థానిక టీడీపీకి చెందిన వారు అసభ్య పదజాలంతో మాట్లాడుతూ ఒక పథకం ప్రకారం రెచ్చగొడుతున్నారు. సోమవారం రాత్రి వైఎస్సార్ సీపీ వార్డు మెంబరు కగ్గా శివయ్య ఇంట్లో లేని సమయం చూసి ఒక్కసారిగా టీడీపీ వర్గీయులు ఇంటిపై పడి భార్య, ఇద్దరు పిల్లలను కొట్టి గాయపరచారు. బాధితురాలు కగ్గా సుధారాణి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుధవారం సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

రాష్ట్ర వాలీబాల్ జట్టుకు వేజండ్ల జడ్పీ విద్యార్థినులు



వాలీబాల్ బాలికల జట్టుకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం విజయశ్రీ, పీఈటీ వెంకటేశ్వరరావులు

వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు పీఈటీ టి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు కడప జిల్లా మైదకూరులో జరిగిన అండర్–17 బాల బాలికల రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టులో పాల్గొన్నారు. వేజండ్ల హైస్కూల్‌లో చదువుతున్న షేక్ సోనీ, మట్టుపల్లి సుమశ్రీలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి గుంటూరు జట్టు ద్వితీయ స్థానం సాధించటానికి కృషి చేశారు. వీరు జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. నవంబర్ నెలలో చెన్నైలో జరిగే జాతీయ స్థాయి అండర్–17 వాలీబాల్ స్కూల్ గేమ్స్‌లో రాష్ట్ర జట్టులో పాల్గొంటారు. శిక్షణ ఇచ్చిన పీఈటీ వెంకటేశ్వరరావును, ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్‌ఎం విజయశ్రీ, ఉపాధ్యాయులు, స్థానిక గ్రామ పెద్దలు అభినందించారు.

అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ వద్ద ఆయా శాఖల ఉన్నతాధికారులు

ప్రత్తిపాడు: భారీ మొత్తంలో అక్రమంగా లారీలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడు గ్రామంలోని ఓ రైస్ మిల్లులో లారీలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ప్రత్తిపాడు సీఐ ఎం.వి.సుబ్బారావు, సివిల్ సప్లయిస్ డీఎస్‌టీవో పద్మజ, ఇన్‌చార్జి డీఎస్‌వో లక్ష్మీనారాయణ రెడ్డిలు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి బుధవారం రాత్రి రైస్ మిల్లుపై సంయుక్తంగా దాడి చేశారు. రైస్‌మిల్లులో లారీలో ఉన్న బియ్యం బస్తాలను పరిశీలించి, రేషన్ బియ్యం అని నిర్ధారించారు. లారీలోని 25 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం బస్తాలు ఉంచిన కర్ణాటకకు చెందిన కేఏ56 1819 నంబరు లారీని సీజ్ చేసి పోలిస్ స్టేషనుకు తరలించారు. బియ్యాన్ని ప్రత్తిపాడులోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌కు తరలించారు.

దొంగతనాల జోరు..... ప్రజల బేజారు

- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస దొంగతనాలు
- అడ్డు అదుపులేని బైక్‌లు, మోటార్ల దొంగతనాలు

చేబ్రోలు: చేబ్రోలు మండలంలో జరుగుతున్న వరుస దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇళ్లలో చోరీలు, బైక్ దొంగతనాలు, మోటారు దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఘటనలు స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. పోలీసుల నిర్లక్ష్యం, అలసత్వం దొంగలకు వరంగా మారింది. వరుసగా ఇన్ని ఘటనలు జరుగుతున్నప్పటికీ దొంగలను కట్టడి చేయటంలో కాని, వాటికి ఫుల్‌స్టాప్ పెట్టి రికవరీ చూపటంలోను విఫలమవుతున్నారు. ప్రజలకు ధైర్యాన్ని నింపాల్సిన పోలీసులు ఆదాయ మార్గాలకు చూపిస్తున్న శ్రద్ధ దొంగలను పట్టుకోవటంలో చూపటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

➡ ఆగస్టు నెలలో వడ్లమూడి గరువుపాలెంకు చెందిన కొబ్బరిబొండాల వ్యాపారి ఉయ్యూరు వెంకటేశ్వరరావుకు చెందిన ఇంటిలో పథకం ప్రకారం దొంగలు ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలోని నగదు, బంగారు వస్తువులను అపహరించుకుపోయారు. సుమారు రూ.పది లక్షల ఆస్తి చోరీకి గురైంది. శ్రీశైలం దైవదర్శనంకు వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు వెళ్లటంతో ఇంటి తలుపులు, కిటికీలు విరగకొట్టి లోపలకు వచ్చిన దొంగలు రెండు బీరువాలలోని రూ.2.10 లక్షల నగదు, 14సవర్ల బంగారం, వెండి వస్తువులను దోచుకుపోయారు. భారీ మొత్తంలో జరిగిన దోపిడీ ఘటన సంచలనం కలిగించినప్పటికీ దొంగల ఆచూకీ నేటి వరకు లభించలేదు.

➡ ఆగస్టు నెలలో మండల పరిధిలోని శేకూరు దళితవాడ ప్రాంతంలో ఇరిగేషన్ శాఖలో పనిచేసిన రిటైర్డు ఉద్యోగి ఉన్నం సుందరరావు అనుమానాస్పద స్థితిలో హత్యకు గురయ్యాడు. ఒంటరిగా సొంత భవనంలో నివసించే సుందరరావు హత్య ఆస్తి కోసమే జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నప్పటికీ నిందితులను గుర్తించటంలో పోలీసులు వైఫల్యం చెందారు.

➡ కొత్తరెడ్డిపాలెంలో పట్టపగలు చైన్ స్నాచింగ్ ఘటన జరిగింది. దీనికి కారణమైన దొంగలను గుర్తించలేకపోయారు.

➡ నారాకోడూరు మెయిన్ సెంటర్‌లోని కిరాణా షాపులో మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు.

అడ్డు అదుపులేని బైక్‌లు, మోటార్ల దొంగతనాలు...

కళ్లు మూసి కళ్లు తెరిచి చూసే లోపు ద్విచక్ర వాహనాలు మాయమైన ఘటనలు చేబ్రోలు మండలంలో చోటు చేసుకున్నాయి. ప్రధాన సెంటర్‌లు, వ్యవసాయ పొలాలు, రహదారి పక్కన ఉన్న ప్రాంతాల్లో విలువైన నీళ్ల మోటార్లు, పంపుసెట్లను దొంగలు తస్కరించుకుపోతున్నారు. మండల పరిధిలోని వీరనాయకుని పాలెం గ్రామానికి చెందిన దూళ్ల రామారావు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. వడ్లమూడి గ్రామానికి చెందిన మణికంఠ బైక్‌ను దొంగలు మాయం చేశారు. మండల పరిధిలోని మంచాల గ్రామంలోని జీబీసీ రహదారి పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలిపి పొలంలోకి వెళ్లిన రైతు నరసింహారావు వచ్చి చూసే సరికి బైక్ మాయమైంది. వేజండ్లలో రోడ్డు పక్కన ఉన్న బైక్‌ను దొంగలు అపహరించుకుపోయారు. సుద్దపల్లిలో చర్చి ముందు ఉంచిన బైక్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిబూడిదైంది. దీనికి కారణమైనవారిని గుర్తించిన దాఖలాలు లేవు.

➡ నారాకోడూరు గ్రామ సచివాలయం వద్ద ఉంచిన సుమారు రూ.పదివేల విలువైన నీళ్ల మోటారును దొంగలు అపహరించుకుపోయారు. మంచాల గ్రామంలోని మెయిన్ రోడ్డులో గత నెలలో సుమారు రూ.పది వేల విలువ చేసే నీళ్ల మోటార్‌ను దొంగలు మాయం చేశారు. ఇరువురు దొంగల ఆచూకీ సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. వరుస ఘటనలు జరుగుతున్నప్పటికీ పోలీసులు వారిని పట్టుకోవటంలో విఫలమవ టంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కొంత మంది సిబ్బంది సహకారంతోనే దొంగలు అత్యుత్సాహం చూపుతున్నారనే ఆరోపణలు వస్తున్నా యి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి దొంగలను కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దీనిపై చేబ్రోలు ఎస్ఐ కె.ఆనంద్‌ను సాక్షి వివరణ కోరగా....

చేబ్రోలు మండలంలో జరిగిన బైక్ దొంగతనాలకు సంబంధించి నిందితులను పట్టుకోవటం కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీసీఎస్ టీం కూడా పనిచేస్తున్నట్లు తెలిపారు. చైన్ స్నాచింగ్ ఘటనలకు సంబంధించిన దొంగలను పట్టుకోవటం కోసం సీసీఎస్ బృందాలు సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గరువుపాలెంలో జరిగిన దొంగనం స్థానిక పొన్నూరు రూరల్ సీఐ ఘటనకు బాధ్యులైన నిందితుల ఆచూకీ కోసం కృషి చేస్తున్నారని ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

చిట్టీల పేరుతో టోకరా

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పెదకాకాని: చిట్టీల పేరుతో సభ్యులకు టోకరా పెట్టడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం పెదకాకాని మండలం, కొప్పురావూరు గ్రామానికి చెందిన కామినేని శ్రీనివాసరావు, భార్య మాధవిలు గత కొంతకాలంగా ఎటువంటి అనుమతులు లేకుండా చిట్టీ(చీటి పాటలు)లు నిర్వహిస్తున్నారు. వారిని నమ్మి సుమారు 70 మంది సభ్యులు దాదాపు కోటి రూపాయల వరకూ చీటీలు వేశారు. చిట్టీలు పాడిన వారికి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టడంతో పరిస్థితిని గుర్తించి గత సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల దినోత్సవంలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితులు పెదకాకాని పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. చిట్టీలు వేసి రూ.8 లక్షల వరకూ మోసపోయామని, విచారించి న్యాయం చేయాలని, చిట్టీ నిర్వాహకుల బాధితులు 70 మంది వరకూ ఉంటారని గ్రామానికి చెందిన పాలిశెట్టి లక్ష్మీనరసమ్మ బుధవారం ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కామినేని మాధవి, భర్త శ్రీనివాసరావులపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

సబ్‌ప్లాన్ నిధులతో అభివృద్ధి పథకాలు రూపొందించాలి

నెహ్రూనగర్ : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా దళితులు, ఆదివాసీల అభ్యున్నతికి ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు రూపొందించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కార్యదర్శి అల్లడి దేవకుమార్ తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల పునాదిగా దళిత ఆదివాసీ మేనిఫెస్టో– 2024ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో దళిత, ఆదివాసీ మేనిఫెస్టోపై గుంటూరు జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవకుమార్ మాట్లాడుతూ మేనిఫెస్టోను అన్ని రాజకీయ పార్టీలకు అందజేసి వాటిని అమలు పరిచే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్, వివిధ సంఘాల నాయకులు కొండపల్లి సాల్మన్‌పాల్, అనిల్, చంద్రా నాయక్, మల్లెల చిన్నప్ప పాల్గొన్నారు.